
ప్రజాశక్తి

మంగళవారం 21 నవంబర్ 2023



అన్నదాతల్లో అలజడి

ప్రజాశక్తి - వీరఘట్టం

వాతావరణంలో ఒక్కసారి మార్పులు రావడంతో అన్నదాతల్లో అలజడి మొదలైంది. ఉదయం నుండి సాయంత్రం వరకు ఎండ ఎక్కుతూ మబ్బు వస్తూ ఒక్కసారిగా ఆకాశంలో మబ్బులు ఏర్పడ్డాయి. దీంతో అన్నదాతలు బిక్కుబిక్కుమంటున్నారు. మండలంలోని ఈ ఏడాది 16,147 ఎకరాల్లో 9900 మంది చిన్న, సన్న కారు రైతులు వరి పంట సాగు చేసినట్లు మండల వ్యవసాయ అధికారులు గణాంకాలు చెబుతున్నారు. ఇప్పటికీ మండలంలోని నడుకూరు, కత్తులకవిటి, యు.వెంకంపేట, కొట్టుగుమ్మడ, విక్రాంపురం, నడిమికెళ్ల తదితర గ్రామాల్లో కోతలు మొదలయ్యాయి. అలాగే కొన్ని ప్రాంతాల్లో కూలీలు దొరక్క పంట పండినప్పటికీ కోతలు ప్రారంభించలేదు. వేలాది రూపాయలు వెచ్చించి పంటలు సాగు చేసినప్పటికీ వాతావరణంలో మార్పు రావడంతో అన్నదాతలు గుండెల్లో రైలు పరిగెడుతుంది.

నిరవధిక సమ్మె విజయవంతానికి

అంగన్‌వాడీల నిరసనలు

నోటీసులు అందజేత

వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని, తదితర సమస్యలు పరిష్కరించాలని సంక్షేమ పథకాలు అమలు కోరుతూ డిసెంబర్ 8 నుంచి నిరవధిక సమ్మె అంగన్‌వాడీలు తలపెట్టారు. ఈ మేరకు సోమవారం ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన అంగన్‌వాడీలు జిల్లాలోని పలుచోట్ల ధర్నాలు, నిరసనలు తెలుపుతూ, సిడిపిఒలకు సమ్మె నోటీసులు అందజేశారు.

పజాశక్తి - పార్వతీపురంరూరల్

అంగన్వాడీల వేతనాల పెంపు, గ్రాట్యూటి, పెన్షన్ అమలు, ఇతర సమస్యలు పరిష్కారం కోరుతూ డిశంబర్ 8 నుండి తలపెట్టిన నిరవధిక సమ్మె నోటీసును అంగన్వాడీ యూనియన్ నాయకులు సిడిపిఒ విజయగౌరికి అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి గంట జ్యోతి, గౌరవ అధ్యక్షులు ఎం. ఉమామహేశ్వరి మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు, సున్నా నుండి ఆరేళ్లలోపు పిల్లలకు అంగన్వాడీ వర్కర్లు, మినీ వర్కర్లు, హెల్పర్లు అనేక సేవలు అందిస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనాలు చెల్లించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. నిరంతరము నిత్యవసర సరుకుల ధరలు, డీజిల్, పెట్రోలు, గ్యాస్, ధరలు పెరుగుతున్నా వేతనాలు మాత్రం పెరగలేదన్నారు. ప్రస్తుతం ఇస్తున్న గౌరవ వేతనాలతో జీవనం భారంగా ఉందన్నారు. దీనికితోడు కేంద్రాల నిర్వహణకు సంబంధించిన బిల్లులు సకాలంలో చెల్లించక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ కంటే వెయ్యి రూపాయలు ఎక్కువ వేతనం ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి హామీ నేటికీ నెరవేరలేదన్నారు. అంగన్వాడీలకు గ్రాట్యుటీ అమలు చేయాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందని, కానీ మన రాష్ట్రంలో అమలు చేయడం లేదని అన్నారు. 48ఏళ్ల నుంచి పనిచేస్తున్న అంగన్వాడీలకు కనీసం సర్వీసులో ఉండి చనిపోతే మట్టి ఖర్చులు కూడా ఇవ్వడం లేదని, ప్రభుత్వం అందరికీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కూడా అంగన్వాడీలకు అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీ సెంటర్లు నిర్వహణకు వివిధ రకాల యాప్స్ తెచ్చారు. ఫోన్లు పనిచేయడం లేదని, ఏ ట్రైనింగ్ ఇవ్వలేదని, ఏజెన్సీ మారుమూల ప్రాంతాల్లో నెట్టు సిగ్నల్ ఉండడం లేదని, దీనివల్ల అంగన్వాడీలు మానసిక వత్తిడికి గురవుతున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో దశలవారీగా అనేక ఆందోళనలు చేసినా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ఈ నేపథ్యంలో డిసెంబరు 8 నుండి కేంద్రాలను మూసివేసి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్టు తెలిపారు. తక్షణమే తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సెక్టార్ నాయకులు రాజేశ్వరి, గౌరీ, మణి, సాయి, లత, జ్యోతి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సాలూరు: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ కార్యకర్తలు సోమవారం ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జ్యోతి ఆధ్వర్యాన ప్రాజెక్టు పరిధిలోని కార్యకర్తలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించకపోతే డిసెంబర్ 8నుంచి సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ మేరకు వారు సిడిపిఓ బి.సత్యవతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు నాయకులు బి.రాధ, సెక్టార్ నాయకులు శ్యామల, రమణమ్మ, విజయ, తిరుపతమ్మ, శశికళ పాల్గొన్నారు.



పాలకొండ ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

పాలకొండ: స్థానిక ప్రాజెక్ట్ కమిటీ ఆధ్వర్యంలో ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్.హిమప్రభ, జిల్లా కోశాధికారి బి.అమరవేణి, పాలకొండ ప్రాజెక్ట్ అధ్యక్షులు జి.జెస్సిబాయ్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు జి.శారద, కె.శారద, ఎం.శ్యామల, మణికుమారి, రోజా, భవానీ, నిర్మల, పెద్దఎత్తున అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

బలిజిపేట : అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ డిసెంబర్ 8 నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్టు ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సీనియర్ అసిస్టెంట్‌కు సమ్మె నోటీసును అంగనవాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యం అందజేశారు. అనంతరం ప్రాజెక్టు కార్యాలయం ముందు నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ ప్రాజెక్టు నాయకులు కె.దాలమ్మ, సత్యవతి మాట్లాడారు. అధిక సంఖ్యలో కార్యకర్తలు, ఆయాలు, సెక్టార్ నాయకులు పాల్గొన్నారు. లీడర్లు పాల్గొన్నారు.


పాచిపెంట : స్థానిక అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షులు టి.ప్రభావతి ఆధ్వర్యంలో సిడిపిఒకు సమ్మె నోటీసును అందజేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డిసెంబర్ 8నుంచి నిరవధిక సమ్మె చేపడుతున్నామని తెలిపారు. వినతిని అందజేసిన వారిలో ప్రాజెక్ట్ నాయకులు పైడ్రాజు, సత్యవతి, బేగం, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు ఉన్నారు.

కొమరాడ : డిసెంబర్ 8నుంచి జరగనున్న నిరవధిక సమ్మె ముందస్తు నోటీసును ఐసిడిఎస్ ప్రాజెక్టు వద్ద సిడిపిఒ జి.సుగుణకు అందజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి సిరికి అనురాధ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించేంత వరకూ నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి, గంగ రేగివలస, విక్రాంపురం ప్రాజెక్టుల నాయకులు బి.అలివేలు, జ్యోతి ఆయా, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతంపేట: డిసెంబర్ 8 నుంచి సమ్మె చేస్తున్నట్లు నోటీసును సిడిపిఒ పి.రంగలక్ష్మికి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు పార్వతి, దర్శిమీ అందజేశారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



పాలకొండ ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు



సదస్సులో మాట్లాడుతున్న మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, నాయకులు

బిసిలకు సముచిత స్థానం

బిసిల సదస్సులో మాజీ మంత్రి యనమల

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని వెనుకబడిన వర్గాలు మరింతగా వెనుకబడ్డాయని, రాబోయే కాలంలో టిడిపి అధికారంలోకి వస్తుందని, బిసిలకు సముచిత స్థానం కల్పించి పూర్వవైభవం తీసుకువస్తామని మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు అన్నారు. సోమవారం పార్వతీపురం నియోజకవర్గం టిడిపి ఆధ్వర్యంలో ఇన్‌ఛార్జి బోనెల విజయచంద్ర అధ్యక్షతన నిర్వహించిన బిసి సదస్సుకు ముఖ్య అతిథిగా మాజీ మంత్రి కిమిడి కళా వెంకటరావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా యనమల మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకొని వారికి మేలు చేయకపోగా రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించడమే కాకుండా అప్పులపాలు చేశారని విమర్శించారు. ప్రజావ్యతిరేకతను గమనించి సిఎం ఇప్పుడు కొత్తగా నా బిసిలు, ఎస్టీలు, ఎస్సీలు అంటూ కొత్తగా మరో మోసపూరిత నినాదం ఎత్తుకున్నారని ఎద్దేవా చేశారు. కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వాటికి నిధులు మంజూరు చేయకుండా నిర్వీర్యం చేశారని ఆరోపించారు. రాజ్యాంగం వీరికి కల్పించిన రిజర్వేషన్లు తుంగలో తొక్కారని అన్నారు. టిడిపి హయాంలో చంద్రబాబుపాలనను, ఇప్పటి పాలనతో పోలుస్తూ ప్రజలు బేరీజు వేసుకుంటున్నారని, రాబోయే కాలంలో వారికి తిరుగులేని గుణపాఠం చెపుతారని అన్నారు. అనంతరం కిమిడి కళావెంకటరావు మాట్లాడుతూ బిసిలను ఉన్నతులుగా తీర్చిన ఘనత టిడిపి వ్యవస్థాపకులు ఎన్టీయార్ పాత్రను ఎవరూ మరిచిపోలేరన్నారు. అధికారంలోకి రాగానే కార్పొరేషన్లను ఆర్థికంగా బలోపేతం చేయడమే కాకుండా ఆదరణ పథకం తీసుకువచ్చి వారి అభివృద్ధికి తోడ్పడతామని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డి.శ్రీదేవి, టిడిపి నియోజకవర్గ పరిశీలకులు బి.గోవిందరాజులు, అరకుపార్లమెంటు బిసి సెల్ అధ్యక్షులు బూరాడ రామోహన్ రావు, జనసేన నియోజకవర్గ కన్వీనర్ ఎ.మోహన రావు మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు బోను చంద్రమౌళి, జి.రవికుమార్, కొల్లి తిరుపతిరావు, పి.వేణుగోపాలనాయుడు, కౌన్సిలర్లు బడే గౌరినాయుడు, తాతపూడి వెంకటరావు, కె.నారాయణరావు, కోల సరితమధు, సీతానగరం, బలిజిపేట మండలాలకు చెందిన బిసి నాయకులతో పాటు కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

నేడు అంతర్జాతీయ మత్స్యకార దినోత్సవం

ప్రజాశక్తి - పార్వతీపురం

అంతర్జాతీయ మత్స్యకార దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జిల్లా స్థాయిలో మత్స్యకార దినోత్సవం నిర్వహిస్తున్నట్లు జిల్లా మత్స్య శాఖఅధికారి వి. తిరుపతయ్య తెలిపారు. కార్యక్రమంలో కొత్తూరులో రూ.50 లక్షలు విలువ చేసే ఫిష్ లాంజ్ యూనిట్, గుమ్మలక్ష్మీపురంలో రూ.20లక్షల యూనిట్, కురుపాం, సీతానగరంలో రూ.10లక్షలు విలువ చేసే యూనిట్లు, రూ.75 వేల విలువ చేసే యూనిట్లు తొమ్మిది, రూ.20 లక్షలు విలువ చేసే వాహనాలు నాలుగు మంజూరు చేసినట్లు తెలిపారు. అలాగే రూ.2.70 లక్షలు విలువ చేసే 1.60 లక్షల చేప పిల్లలు పంపిణీ చేసినట్లు తెలిపారు.

జిల్లాలో ఆర్థికాభివృద్ధికి పుష్కలంగా అవకాశాలు

ప్రజాశక్తి - పార్వతీపురం



నీతిఆయోగ్ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

జిల్లాలో ఆర్థిక అభివృద్ధికి పుష్కలమైన అవకాశాలు ఉన్నాయని కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. నీతి ఆయోగ్ స్పెషల్ సెక్రెటరీ అనారాయ్, స్టేట్ టాక్స్ కమిషనర్ గిరిజా శంకర్ విశాఖపట్టణం వి.ఎం.ఆర్.డి.ఎ. మీటింగ్ హాలు నుంచి సోమవారం నిర్వహించిన నీతిఆయోగ్ జి.హబ్ ప్రాంతీయ సమావేశానికి కలెక్టరు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరైనారు. సమావేశంలో ఆయన జిల్లా అభివృద్ధి అవకాశాల నివేదికను తెలియజేస్తూ జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి అవసరమైన భూమి, నీరు, మానవవనరులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లాలో వ్యవసాయాధారిత పరిశ్రమలున్నాయని, జిల్లా ధాన్యం దిగుబడికి ప్రసిద్ధిచెందినదని, 98 బియ్యం మిల్లులు ఉన్నాయని తెలిపారు. జాతీయరహదారిని ఆనుకొని 1400 ఎకరాల విస్తీర్ణంలో రెండు పారిశ్రామిల వాడలను సిద్ధం చేసినట్లు తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన భూమి, మానవవనరులు తక్కువ ధరకే లభిస్తాయని, జిల్లాకు ఒడిశాతో సరిహద్దులు, ఎగుమతులకు అవకాశాలు ఉన్నాయని, విశాఖపట్నం ఓడరేవు, విజయనగరంలో నిర్మితమవుతున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, జాతీయ రహదారి జిల్లానుండి రవాణాకు అనుసంధాన మవుతున్నాయని తెలిపారు. పవన విద్యుత్ కేంద్రాలు ఏర్పాటుకు అనువైన వాతావరణం ఉందని తెలిపారు. అలాగే జిల్లాలో పర్యాటకం, ఎకో టూరిజం, సాంస్కృతిక టూరిజం అభివృద్ధికి పుష్కలమైన అవకాశాలు ఉన్నాయని, జిల్లాలో ప్రసిద్ధిచెందిన వాటర్ ఫాల్స్, సాగునీటి జలాశయాలు, దేవాలయాలు, వ్యూ పాయింట్స్, టూరిజం పార్కులు ఉన్నాయని, పర్యాటక ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎల పరిధిలో గిరిజల సంఘాల ద్వారా అటవీ ఉత్పత్తులను తయారు చేసి, ఉత్పత్తులకు స్వంత బ్రాండింగు ద్వారా అమ్ముతున్నట్టు తెలిపారు. నాణ్యమైన పసుపు దిగుబడిలో దేశంలో రెండవ స్థానంలో ఉందని, జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన పంటల ఆధారిత పరిశ్రమల స్థాపనకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయని, రెండు తృణధాన్యాల ప్రాసెసింగుయూనిట్లు నెలకొల్పుతున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా ప్రణాళిక అధికారి వీర్రాజు, జిల్లా పరిశ్రమల అధికారి ఎం.వి. కూర్మారావు హాజరైనారు.



జెసికి వినతి అందజేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

కరువు ప్రాంతాలను ప్రకటించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో కరువు మండలాలు, పంచాయతీలు సర్వే చేసి ప్రభుత్వం వాస్తవికత ఆధారంగా కరువు ప్రాంతంగా ప్రకటించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయంలో జిల్లాలో కరువు, కరువు నష్టపరిహారంపై జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వేణు మాట్లాడుతూ జిల్లాలో కరువు పరిస్థితులు, కరువు వల్ల నష్టపోయిన మండలాలు గూర్చి గతంలో ప్రభుత్వానికి తెలిపినా ఇంతవరకు వ్యవసాయ శాఖ, రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల కరువు ప్రాంతాలు పర్యటించలేదని, ప్రభుత్వం వెల్లడిస్తున్న పంట నష్టపోయిన వివరాలు వాస్తవానికి చాలా దూరంగా ఉన్నాయని విమర్శించారు. పార్వతీపురం మండలంలో నాలుగు వేల ఎకరాల్లో పంట ఎండిపోయిందని, కానీ అధికారులు మాత్రం కేవలం వందెకరాల్లో మాత్రమే పంట నష్టం జరిగిందని కాకి లెక్కలు చెబుతున్నారని అన్నారు. జిల్లాలో 15 మండలాల్లో అనేక పంచాయతీల్లో వేల ఎకరాలు పంట కోత దశలో ఎండిపోయిందని, రైతులకు తీవ్ర నష్టం జరిగిందని అన్నారు. కావున ప్రభుత్వం వెంటనే కరువు నష్టాన్ని ప్రకటించి, ఎకరాకు రూ.25వేలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్య దర్శివర్గ సభ్యులు వై.మన్మధరావు, జిల్లా కమిటీ సభ్యులు గొర్లి వెంకటరమణ పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'కు 152 వినతులు

ప్రజాశక్తి - పార్వతీపురం

జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు పలు సామాజిక, వ్యక్తిగత అంశాలపై 152 అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా జాయింటు కలెక్టరు ఆర్.గోవిందరావు మాట్లాడుతూ ప్రజలు తెలిపిన సమస్యలకు అధికారులు సంతృప్తికర పరిష్కారం చూపాలని ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరు కార్యాలయ సమావేశమందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్, కెఆర్‌సిసి డిప్యూటీ కలెక్టరు కేశవనాయుడు తో కలిసి ప్రజల నుండి వినతులు స్వీకరించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు తెలిపిన సమస్యలను సంబంధిత జిల్లా, మండల అధికారులతో నేరుగా మాట్లాడి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. అర్జీలపై సకాలంలో స్పందించి, చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సాలూరు మండలం జీగిరాంకు చెందిన కుబిరెడ్డి రామారావుకు జాయింటు కలెక్టరు గోవిందరావు వినికిడి యంత్రాన్ని అందజేశారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సీతంపేట ఐటిడిఎలో....

సీతంపేట : సమస్యలు పరిష్కరించాలని పలువురు గిరిజనులు స్పందన కార్యక్రమంలో అర్జీలు సమర్పించారు. స్థానిక ఐటిడిఎ గిరిజన స్పందనను ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ సింహాచలం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ స్పందనకు 33 వినతులు వచ్చాయి. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయ, డిప్యూటీ డిఇఒ లిల్లీరాణి, పార్వతి, సిడిపిఒ పి.రంగలక్ష్మి, హౌసింగ్ డిఇ మోహన్‌రావు, ఎఇ వెంకటేష్, స్పోర్ట్స్ ఇంచార్జ్ జాకబ్ దయానంద్, ఎఎంఒ కోటిబాబు తదితరులు పాల్గొన్నారు.

శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

కార్తీకమాసం నేపథ్యంలో పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లో పురాతన, శివాలయాల దర్శనానికి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు నడపనున్నట్లు డిపిటిఒ సుధాకర్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 20, 27న, వచ్చేనెల 4, 11 తేదీల్లో స్థానిక ఆర్టీసీ డిపో నుంచి ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు శైవక్షేత్రాల సందర్శనార్థం బస్సులు నడపనున్నట్లు చెప్పారు. సంగాం సంగమేశ్వర, నారాయణపురం నీలకంఠేశ్వర, అడ్డాపుశీల కాశీ విశ్వేశ్వర, గుంప సోమేశ్వర, పిట్టలవలస నీలకంఠేశ్వర స్వామి ఆలయాల సందర్శన ఒకే రోజు జరిగేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఇందు కోసం రూ.300 చార్జీ వసూలు చేయనున్నట్లు వెల్లడించారు. ఆసక్తిగల వారు ఈ 73828 34904 నెంబర్‌కు ఫోన్ చేసి టిక్కెట్లు బుక్ చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) 73829 24103, డిపో మేనేజర్ 99592 25621 నెంబర్లను సంప్రదించాలన్నారు.



వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

క్రీడా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - సీతంపేట

జనజాతీయ గౌరవ దివస్ సందర్భంగా రాష్ట్ర గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణా సంస్థ ఆదేశాల మేరకు స్థానిక ఐటిడిఎ పరిధిలో గల పాఠశాలల్లోని విద్యార్థులకు ఐటిడిఎ స్థాయి క్రీడా పోటీలను సోమవారం గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో నిర్వహించారు. వాలీబాల్, ఆర్చరీ, జావెలిన్ త్రో విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు స్థానిక ఎంపిడిఒ గీతాంజలి, ఐటిడిఎ డిప్యూటీ డిఇఒ లిల్లీరాణి పాల్గొన్నారు. పాఠశాల, క్లస్టర్ స్థాయిలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ఐటిడిఎ స్థాయి పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారు ఈనెల 23న రాష్ట్ర స్థాయిలో క్రీడాపోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వీటితో పాటు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలను కూడా నిర్వహించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి జాకబ్ దయానందం, ఎఎంఒ కోటిబాబు, జిసిడిఒ రాములమ్మ, ఇతర పీడీలు, పిఇటిలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని

మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

సమస్యలు పరిష్కరించాలని, ఆప్కాస్ ఉద్యోగస్తులందరినీ రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేయాలని కోరుతూ జిల్లాలోని పార్వతీపురం, సాలూరు, పాలకొండ నగర పంచాయతీలో మున్సిపల్ కార్మికులు సోమవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా పార్వతీపురంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల సెంటర్ వరకు సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ ఆధ్వర్యంలో నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు నాగవంశం శంకర్రావు మాట్లాడుతూ ఎన్నికల ముందు అసెంబ్లీ సాక్షిగా అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేస్తానని హామీ ఇచ్చి నేటికీ హామీ అమలు కాలేదని విమర్శించారు. ఇంజినీరింగ్ కార్మికులకు హెల్త్ అలవెన్స్, క్లాప్ డ్రైవర్లకు రూ.18,500 జీతం చెల్లించాలని, రెండు నెలల జీతం సమస్యలు పరిష్కరించాలని, రెగ్యులర్ కార్మికులకు గతంలో సంక్రాంతికి ఇచ్చిన బట్టలకు కుట్టుకూలి అలవెన్స్ ఇవ్వాలని కోరారు. బకాయి డిఎలు చెల్లించాలని, సరెండర్ లీవ్ ఇవ్వాలని తదితర సమస్యల పరిష్కారం కోరుతూ మంగళవారం జిల్లా కలెక్టరేట్ వద్ద తలపెట్టిన వంటావార్పు



పార్వతీపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు



కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్మికులు చీపురుపల్లి సింహాచలం, మల్లేశు, రాజేష్, శివ, గంగయ్యలు, నిర్మల, అప్పలమ్మ, విప్పలమ్మ, సుజాత, గంగరాజు, శ్రీను, శివ పాల్గొన్నారు.

సాలూరు: సిఎం జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ సోమవారం మున్సిపల్ కార్మికులు ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు అద్వర్యాన నిర్వహించిన ర్యాలీ గాంధీనగర్ లో మొదలై ప్రధాన రహదారి మీదుగా మున్సిపల్ కార్యాలయం వరకు సాగింది. జిల్లాలోని మున్సిపల్ కార్మికులతో మంగళవారం కలెక్టర్ కార్యాలయం వద్ద వంటావార్పు నిర్వహిస్తామని చెప్పారు. మున్సిపాలిటీలలో పని చేస్తున్న కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికుల ను రెగ్యులర్ చేస్తానని, సమాన పనికి సమాన వేతనం చెల్లిస్తామని సిఎం జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు టి.శంకరరావు, స్వప్న, బాలరాజు, టి.రవి, టి.రాముడు పాల్గొన్నారు.

పాలకొండ : స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పడాల భాస్కరరావు, చింతల సంజీవి పడాల వేణు మాట్లాడారు. కార్యక్రమంలో చింతల సురేషు, ఎన్.సాయి, వి.ఆంజనేయులు, కె.నరసింహ, బి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

ఈనెల 14 నుంచి 20 నిర్వహించిన 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఈ వారం రోజులు జిల్లాలోని పలు శాఖా గ్రంథాలయాల్లో విద్యార్థులకు నిర్వహించి వివిధ పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

పాలకొండ: గ్రంథాలయాలు నిలయాలు ఉన్న చోటే..విజ్ఞాన వంతులు పెరిగి అభివృద్ధికి తోడ్పాడుతుందని శాసన మండలి విప్ పాలవలస విక్రాంత్ అన్నారు. సోమవారం గ్రంథాలయాలు వారోత్సవాలు ముగింపు కార్యక్రమాన్ని స్థానిక గ్రంథాలయాలంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శాసన మండలి విప్ హాజరై మాట్లాడారు.కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి బి.గణేష్ బాబు, ఎంపీపీ బి.బాను, కౌన్సిలర్లు దుప్పాడ పాపినాయుడు, టి.శంకరరావు, ఉపాధ్యాయులు బి.శంకరరావు తదితరులు పాల్గొన్నారు. వారోత్సవాల్లో భాగంగా వివిధ పోటీలు విజేతులగా నిలిచిన విద్యార్థులు బహుమతులు అందించారు.

పార్వతీపురంరూరల్ : రాష్ట్ర గ్రంథాలయ సంఘం ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నర్సిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్ రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు పఠనం పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ కర్త డాక్టర్ డి.పారినాయుడు, రాష్ట్ర గ్రంథాలయ సంఘం ఉపాధ్యక్షులు టి.శివకేశవరావు మాట్లాడారు. విద్యార్థులకు పద్య పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్ ఛార్జ్ ప్రధానోపాధ్యాయులు ఎం.వెంకటనాయుడు, ఉపాధ్యాయులు బాలకృష్ణ, పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : పట్టణంలో గల శాఖా గ్రంథాలయంలో జరిగిన ముగింపు వారోత్సవాలను మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇటీవల చిత్రలేఖనం విజయం సాధించిన విద్యార్థినిలకు బహుమతులు ప్రధానం చేసారు. కార్యక్రమంలో ప్రముఖ బాల సాహిత్యవేత్త బి.ఉమామహేశ్వరరావు మరియు రిటైర్డ్ ఇంగ్లీష్ టీచర్ మిన్నారావు, పాఠకులు గ్రంథాలయాధికారి ఎ.ధర్మారావు పాల్గొన్నారు.

వీరఘట్టం: స్థానిక శాఖ గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు సోమవారం బహుమతులు ప్రధానం చేసినట్లు గ్రంథాలయ అధికారి ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. విజేతలకు కోడి రామ్మూర్తి నాయుడు మనవడు కోడి వెంకటరమణ నాయుడు విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎంపిపి ఉరిటి రామారావు హాజరయ్యారు. ఇఒపిఆర్‌డి గోపాలరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఇఒ కొండలరావు, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల వైస్ ప్రిన్సిపల్ ఇ.వెంకటరత్నం, సాయి నికేతన్ హైస్కూల్ ఉపాధ్యాయులు సదాశివరావు, జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థినిలు, శాఖ గ్రంథాలయ నిర్వహకులు నల్ల మధుసూదన్‌రావు పాల్గొన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎంపిపి బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యం అందర్నీ అలరించింది.

పాచిపెంట: స్థానిక శాఖ గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి బి.ప్రమీల, కొత్తవలస జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కృష్ణాజీ, శ్రీ సరస్వతి శిశు మందిర్ ప్రధాన ఉపాధ్యాయులు సూర్యనారాయణ, సమత పబ్లిక్ స్కూల్ ఉపాధ్యాయులు సంతోసి కుమారి, రిటైడ్ టీచర్ మన్మధరావు తదితరులు పాల్గొన్నారు. వారోత్సవాల్లో జరిగిన వ్యాస రచన, చిత్రలేఖనం, క్విజ్, డిబేట్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.ఉదయ్ భాస్కర్, విద్యార్థులు పాల్గొన్నారు.


పార్వతీపురం :విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న గ్రంథాలయ సంఘు సభ్యులు

సీతంపేట : 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు కార్యక్రమానికి ఐటిడిఎ డిప్యూటీ డిఇఒ లిల్లీరాణి ముఖఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమములో గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు, సహాయకుడు రామకృష్ణ పాల్గొన్నారు.

సీతానగరం : స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు ముంగిపు కార్యక్రమానికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు జి పైడిరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో పెదబోగిలి సర్పంచ్ జె.తేరేజమ్మ, గరికయ్య, వార్డు సభ్యులు పెద్దింటి రామారావు, టి.రామారావు, ఉపాధ్యాయులు, గ్రంథాలయాధికారి జి.వెంకట్రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భామిని: స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రయిన కె.సునీత ఆధ్వర్యంలో ముగింపు వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తహశీల్దార్ నీలాపు అప్పారావు విచ్చేశారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి బిడ్డికి విష్ణు, ఉపాధ్యాయులు సునంద, శాంతి, శ్రీదేవి, సుజాత, జగదీశ్ పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులకు సత్వర న్యాయం : ఎస్‌పి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులను పరిశీలించి వెంటనే బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అధికారులను ఆదేశించారు. ప్రతి సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమంలో భాగంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. సమస్యలపై ఫిర్యాదుదారులు స్వేచ్ఛగా విన్నవించుకోగా, వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని, బాధితులకు తక్షణ న్యాయం అందించేలా చర్యలు తీసుకోని, తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రదాన కార్యాలయానికి పంపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పది ఫిర్యాదులు అందాయి. ఈ స్పందన కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఒ.దిలీప్ కిరణ్, ట్రైనీ డిఎస్పీ ఎస్ఎండి అజీజ్, ఎస్‌బి సిఐ సిహెచ్.లక్ష్మణరావు, టౌన్ సిఐ కృష్ణారావు, డిసిఆర్‌బి సిఐ ఎన్‌వి ప్రభాకరరావు, ఎస్ఐ పాపారావు, సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి పెందుర్తి నియోజకవర్గ పరిశీలకులుగా దత్తి

ప్రజాశక్తి - కురుపాం

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దత్తి లక్ష్మణరావును విశాఖ జిల్లా పెందుర్తి నియోజకవర్గం పరిశీలకులుగా టిడిపి అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిష్టానం తనపై నమ్మకం ఉంచి నియోజకవర్గ పరిశీలకులుగా బాధ్యతలు అప్పగించిందని, అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి పరిశీలకులుగా ఆ నియోజకవర్గం, పార్టీ పరిస్థితులు తెలుసుకొని పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా ఆయనకు కురుపాం నియోజకవర్గ టిడిపి అశావాసులు పువ్వుల లావణ్య, బిడ్డిక పద్మావతి, బిడ్డిక తమ్మయ్య, చందక రామకృష్ణ, నియోజకవర్గంలోని టిడిపి శ్రేణులు అభినందనలు తెలిపారు.


ఎంపిడిఒ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపిపి పద్మావతి

శివరామప్పకు పలువురి నివాళి

ప్రజాశక్తి - కురుపాం

గుండెపోటుతో ఆదివారం మృతి చెందిన ఎంపిడిఒ వివి శివరామప్ప మృతదేహానికి మండల ప్రజాప్రతినిధులు, అధికారులు నివాళ్లు అర్పించారు. ఎంపిడిఒ మరణ వార్త తెలుసుకున్న ఎంపిపి శెట్టి పద్మావతి, జడ్పిటిసి జి.సుజాత, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి శెట్టి నాగేశ్వరరావు, అయ్యఎరకల కార్పొరేషన్ డైరెక్టర్ విజయచంద్రశేఖర్, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఆయన స్వగ్రామమైన పితాపురం వెళ్లి నివాళులర్పించి అతని కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ ఆర్.రమేష్‌కుమార్, సిబ్బంది, మండలంలోని పలు సచివాలయాల్లో సిబ్బంది, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు శివరామప్ప చిత్రపటానికి పూలమాల లేసి నివాళులర్పించి మౌనం పాటించారు.

ఇరిడిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఇరిడి, పెదకర్జలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సోమవారం జరిగింది. ఇరిడి జరిగిన కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వ నోడల్ అధికారి డాక్టర్ అమిత్ జైన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రధాన పథకాల ప్రయోజనాలు, వాటి సమాచారం ప్రజలకు చేరవేయడం ఈ ప్రచార యాత్ర ఉద్దేశం అని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించి, ప్రజలకు వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. అలాగే రైతులకు డ్రోన్ ద్వారా వ్యవసాయ విధానాలపై అవగాహన కల్పించారు. ఉజ్వల గ్యాస్ కనెక్షన్ కోసం సంబంధిత సిబ్బంది లబ్ధిదారుల పేర్లు నమోదు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తుల చేత వికసిత్ భారత్ సంకల్ప ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి బివి సత్యనారాయణ, మండల నోడల్ అధికారి సాల్మాన్ రాజు, ఎంపిటిసి సభ్యులు కె.మల్లేస్, సర్పంచ్ కె.వాసుదేవరావు, సచివాలయ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు. అలాగే పెదకర్జలో జరిగిన కార్యక్రమంలో ఎంపిపి కె.దీనమయ్య, జెడ్పిటిసి రాధిక, సర్పంచ్ ఎం.మల్లేష్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు రక్షణ చట్టాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండలంలోని బందలుప్పి జిల్లా పరిషత్ పాఠశాలలో జిల్లా పోలీస్ శాఖ సోమవారం ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సమావేశంలో మండలం మహిళా రక్షక్ సిబ్బంది పాఠశాల విద్యార్థుల కు బాల్యవివాహాలు, ఆడపిల్లలను అసభ్యంగా ఏడిపించడం, స్కూళ్లలో ర్యాగింగ్, దిశా చట్టం, యాప్, హెల్ప్‌లైన్ నెంబర్లు గురించి వివరించారు. కార్యక్ర మంలో విద్యార్థిని, విద్యార్థులు నాటిక రూపంలో ఈ అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మహిళా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జీవకారుణ్యం పెంపొందించాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - పార్వతీపురం

జీవకారుణ్యం పెంపొందిం చాలని ఆర్‌డిఒ కె.హేమలత అన్నారు. జీవ కారుణ్య సంఘం సమావేశం స్థానిక రెవిన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ విద్యార్థుల్లో జీవకారుణ్యం పెంపొందించేందుకు పాఠశాల, కళాశాలల స్థాయిలో దయాగుణం క్లబ్ ఏర్పాటు చేయాలన్నారు. కుక్కలను చంపకుండా సంతాన నిరోధక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జంతు రవాణాలో మౌళిక సదుపాయాలు, జంతు హింస లేకుండా చూడాలని స్పష్టం చేశారు. సంతల పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు. ఆక్సిటోసిన్ ఇంజక్షన్ పశు వైద్యుని ధవపత్రం లేకుండా అమ్ముతున్న మందుల షాపులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పవిత్రమ దినాల్లో మాంసం అమ్మకాలు, జల బలుల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పార్వతీపురం, బలిజిపేట వారాంతపు సంతల నుండి పశువుల అక్రమ రవాణా, నిబంధనలకు విరుద్ధంగా రవాణా చేస్తున్న వ్యక్తులు, వాహనాలపై చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారికి ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా పనిచేసి బదిలీపై వెళ్తున్న డాక్టర్ శిరీషకు సిబ్బంది సోమవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈమె 50నెలలుగా పిహెచ్‌సిలో విశేష సేవలందించారు. ఉన్నత చదువు కోసం వెళ్తున్న డాక్టర్ శిరీషకు పిహెచ్‌సి వైద్యులు, సిబ్బంది, ఎఎన్ఎంలు, సచివాలయాల ఆరోగ్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశాకార్యకర్తలు తదితరులు ఘనంగా వీడ్కోలు పలికారు. డాక్టర్ శిరీష సేవలను వారంతా కొనియాడారు. తనకు అన్నివిధాల సంపూర్ణ సహకారం అందించిన మండలంలోని ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, ప్రజలకు, వైద్య సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. శిరీష సోమవారం రిలీవ్ కావడంతో ఇంతవరకు రెండో వైద్యులుగా ఉంటున్న డాక్టర్ ఉషారాణి మెడికల్ ఆఫీసర్‌గా సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇదిలాఉండగా శిరీష స్థానంలో రెండో వైద్యులుగా డాక్టర్ పావణి సోమవారం బాధ్యతలు చేపట్టారు.

పంటకోత ప్రయోగాలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండలంలోని పెదబొండపల్లి, బందలుప్పిలో వరిచేలలో జరిగిన పంటకోత ప్రయోగాలను ప్రకృతి వ్యవసాయం, జిల్లా ప్రోజెక్టు మేనేజర్ షణ్ముఖరాజు సోమవారం క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. పెదబొండపల్లికి చెందిన రైతు వేమిరెడ్డి సూర్యనారాయణ పొలంలో జరిపిన ప్రయోగంలో సంపద విత్తనం 28బస్తాల దిగుబడి వచ్చినట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల వరి దిగుబడిలో ప్రభావం చూపవచ్చన్నారు. నీటి తడులు ఉన్న రైతులు వరి కోతలు అనంతరం తమ పొలాల్లో ఎటిఎం మెడళ్లలో 15 నుండి 20 రకాల ఆకు, కూరగాయలతో పాటు దుంప జాతి, తీగజాతి పంటలు పండించుకోవచ్చని, దీనివల్ల రోజువారీ ఆదాయం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మండల మోటివేటర్ వై.శ్రీరాములు, రైతులు పాల్గొన్నారు.

30న చలో కలెక్టరేట్

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జిల్లా ఏర్పడి రెండేళ్లు పూర్తికావస్తున్నా గిరిజన, పేద, మధ్యతరగతి విద్యార్థి, యువతకు మెరుగైన విద్య, ఉపాధి అవకాశాలు కరువయ్యాయని, వీటి పరిష్కారం కోరుతూ ఈనెల 30న చలో కలెక్టరేట్ తలపెట్టినట్టు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.పండు పి.రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ధర్నాకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సుమారుగా 70 వేల మంది విద్యార్థులు ఉన్న మన జిల్లాలో ఉన్నత, పైచదువుల నిమిత్తం ఉత్తమమైన విద్యాసంస్థల్లేకపోవడం అన్యాయమని మండిపడ్డారు. నూతన విద్యా విధానాన్ని దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలు చేయలేదని, ఒక్క మన రాష్ట్ర ప్రభుత్వమే వేగంగా అమలు చేయడం దౌర్భాగ్యమని అన్నారు. రాష్ట్ర విభజన సమయంలో జిల్లాకు మెడికల్, ఇంజనీరింగ్, యూనివర్సిటీలను నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చిన మోడీ, జగన్ నాలుగున్నరేళ్లుగా శంకుస్థాపనలతో కాలక్షేపం చేపడుతున్నా జిల్లా మంత్రులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదని విమర్శించారు. ప్రజల వద్దనే పాలననే ప్రభుత్వానికి ప్రజల చెంతన విద్యాసంస్థలు నెలకొల్పవడం పాలకులకు పట్టదా అని ప్రశ్నించారు. జిల్లా విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ సైకిల్ యాత్ర, ఈనెల8న రాష్ట్రవ్యాప్తంగా బంద్ చేపట్టిందని, అయినా రాష్ట్ర ప్రభుత్వ వైఖరిలో ఎలాంటి చలనం లేదని తెలిపారు. అందుకే ఈనెల 24 నుంచి 29 వరకు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిరసన దీక్షలు, 30న చలో కలెక్టరేట్ చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీవళిక, మహేష్, భార్గవ్, ఐశ్వర్య తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు బెయిల్.. టిడిపి శ్రేణుల సంబరాలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

టిడిపి అధినేత చంద్రబాబుపై రాష్ట్ర ప్రభుత్వం పెట్టిని స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో రాష్ట్రహైకోర్టు సోమవారం రెగ్యులర్ బెయిల్ మంజూరు చేయడం పట్ల పార్వతీపురం నియోజకవర్గ టిడిపి నాయకులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. రాజకీయ కక్షల నేపథ్యంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెట్టిన కేసుల్లో ఏకోశానా అవినీతి జరిగినట్లు నిరూపించకపోవడంతో ప్రజల ముందు ఈ రోజు రాష్ట్ర ప్రభుత్వమే దోషిగా నిలబడిందని, చంద్రబాబు నిజాయితీ నిరూపణ అయ్యిందని అన్నారు. త్వరలో సుప్రీంకోర్టులో పెండింగ్‌లో తీర్పు వెలువడితే అన్ని కేసులు రద్దు అవుతాయని అన్నారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, నియోజకవర్గ ఇన్‌చార్జీ బోనెల విజయచంద్ర, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డి.శ్రీదేవి, కౌన్సిలర్లు కెనారాయణరావు, కోలసరితామధు,


బాణసంచా కాలుస్తున్న టిడిపి నాయకులు

బడేగౌరినాయుడు, తాతపూడివెంకటరావు, పట్టణ,మండల పార్టీ అధ్యక్షులు జిరవికుమార్, బోనుచంద్రమౌళి, నాయకులు గొట్టాపు వెంకట నాయుడు, బార్నాలశీతారం, తదితరులున్నారు.

కురుపాం : టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు రెగ్యులర్ బెయిల్ వచ్చినందుకు స్థానిక టిడిపి కార్యాలయంలో మండల కన్వీనర్ కె.వి కొండయ్య ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసి అనంతరం బస్టాండ్ వరకు ర్యాలీగా వెళ్లి మందు గుండ సామాగ్రిని సంబరాలు చేశారు. కార్యక్రమం లో టిడిపి నాయకులు కిమిడి రామరాజు , సుఖేష్ చంద్ర పండ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


గోతుల వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, ఆటో కార్మికులు

గోతులను తక్షణమే పూడ్చాలి

ప్రజాశక్తి - కొమరాడ

అంతర్‌రాష్ట్ర రహదారిపై ఉన్న గోతులను పూడ్చివేసి దారులకు, ప్రయాణికులకు భరోసా కల్పించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఈమేరకు మండలంలోని గుమడ సమీపాల గల అంతరాష్ట్ర రహదారి పైన ఉన్న పెద్ద గోతుల వద్ద సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం నుండి కొమరాడ మీదుగా మూడు రాష్ట్రాలకు వెళ్లే కూనేరు మీదుగా అంతరాష్ట్ర రహదారిలో అనేక చోట్ల పెద్దపెద్ద గోతులు ఏర్పడడంతో ప్రతిరోజు వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై కలెక్టర్‌కు, ఐటిడిఎ పిఒకు, తహశీల్దార్ వినతులు ఇచ్చినా ప్రయోజనం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రహదారి పైన ఉన్న గోతులను పూడ్చివేసి ప్రయాణికుల ప్రాణాలు కాపాడాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఉపేంద్ర, లక్ష్మయ్య, పలువురు డ్రైవర్లు, యువకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - భామిని

రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా పారదర్శక పాలన అందిస్తూ, గ్రామీణ కుటుంబాల ఆర్థిక స్థితిగతులు, జీవన ప్రమాణాలు మెరుగుపర్చి సుస్థిర పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వి.కళావతి అన్నారు. మండలంలోని వడ్డంగి పంచాయతీ పరిధిలో వడ్డంగి, వడ్డంగి గూడ, పిల్లి గూడ, మూలగూడ, బొమ్మిక గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.ప్రస్తుతం గ్రామంలో వైసిపి హయాంలో ఎంత అభివృద్ధి జరిగిందనే అంశాలు వివరించారు. అనంతరం వడ్డంగిలో కొత్తగా నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం మనుమకొండలో అసైన్డ్ భూమి పట్టాలు పంచారు. వై ఎపి నీడ్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పంచాయతీ భవనం, వెల్ నెస్ సెంటర్, అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టేలా చూడాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమం వైసిపి కన్వీనర్ తోట సింహాచలం, వైస్‌ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, జెసిఎస్ కో ఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, బత్తిలి పిఎసిఎస్ చైర్మన్ బి.రఘుపతి నాయుడు, వడ్డంగి, మనుమకొండ, పాలవలస సర్పంచులు నిమ్మల ఉషారాణి, నిమ్మల కేశవ, బిడ్డిక తమ్మారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గ్రామంలో విద్యను అభ్యసించి పై రాష్ట్రాల్లో ఉన్నత ఉద్యోగం చేస్తున్న గ్రామవాసి మద్ది శేష కుమారుడు మద్ది శ్రీనివాసరావు రూ.11 వేలతో 11 మంది పేద, ప్రతిభ కలిగిన విద్యార్థులకు తన జన్మదిన సందర్భంగా సోమవారం బహుమతులను సర్పంచ్ గౌరీ శంకర్రావు ఆధ్వర్యంలో అందజేశారు. మద్ది శ్రీనివాసరావు 20 పుట్టినరోజు సందర్భంగా తాను చదువుకున్న, పుట్టిన గ్రామానికి ఏదో తనవంతు సహాయం చేయాలన్న సదుద్దేశంతో 11మంది విద్యార్థులకు తనకు తోచిన మేరకు సహాయం అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తన స్నేహితుడు శ్రీనివాసరావు విద్యార్థులకు బహుమతులు అందజేయడం ఆనందదాయకమని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్, వైశ్య సంఘం అధ్యక్షులు గుడ్ల హరిప్రసాదరావు, ఉప సర్పంచ్ కిషోర్ కుమార్, వీఆర్వో బి.హరికష్ణ, వెల్ఫేర్ అసిస్టెంట్ సంతోష్ కుమార్, సీనియర్ ఉపాధ్యాయులు సీతన్న, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య కార్యక్రమాలు పక్కాగా నిర్వహించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజారోగ్య కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు ఆదేశించారు. గరుగుబిల్లి మండల ఆరోగ్య కేంద్రాలకు చెందిన వైద్య సిబ్బందితో సోమవారం స్థానిక జిల్లా ఆరోగ్య కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజారోగ్యం దృష్ట్యా ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి ఆరోగ్య కార్యక్రమం ద్వారా ప్రజలకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందేలా పని చేయాలన్నారు. సచివాలయాల వారీగా ప్రగతి నివేదికలను సమీక్షించారు. మొదటి త్రైమాసికంలోనే గర్భిణీల రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని, హై రిస్క్ గర్భిణీలను గుర్తించాలని ఆదేశించారు. ఐదేళ్ల లోపు పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన హెచ్‌బిఎన్‌సి, హెచ్‌బివైసి, సార్వత్రిక టీకా కార్యక్రమం, సాన్స్, ఐఎఫ్ఎ ద్రావణం తదితర కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. జగనన్న ఆరోగ్య సురక్ష రిఫరల్స్‌కు చికిత్స పూర్తి స్థాయిలో జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యానికి సంబంధించి రక్తహీనతను గుర్తించాలన్నారు. ఈ నెల 16న ప్రారంభమైన విక్షిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా సికిల్ సెల్ ఎనీమియా గుర్తించడం, కఫం పరీక్షలు జరిపి క్షయ వ్యాధిగ్రస్తులకు గుర్తించడం, పిఎంజెవై కార్డుల పంపిణీ, పెండింగ్ ఉన్నవారికి ఐడి క్రియేట్ చేయాలన్నారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా ఆర్బీఎస్కే అధికారి డాక్టర్ డి. భాస్కరరావు, డిఐఒ డాక్టర్ టి. జగన్మోహనరావు, ఎఫ్ డిపి నోడల్ అధికారి డాక్టర్ ఎం.వినోద్, డిపిహెచ్‌ఎన్ఒ ఉషారాణి, డిపిఒ లీలారాణి, సిబ్బంది విజయలక్ష్మి, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పనిచేయాలి

ప్రజాశక్తి - సీతంపేట

వైసిపి పాలన అంతమొందించేందుకు క్షేత్ర స్థాయిలో సమర్ధవంతంగా పనిచేయాలని పాలకొండ నియోజకవర్గ టిడిపి నాయకులు పడాల భూదేవికార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. సోమవారం సీతంపేట లో తన నివాసంలో కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యారు. స్కిల్ డెవలప్మెంట్ కేసులో నారా చంద్రబాబు నాయుడుకు సోమవారం రెగ్యులర్ బెయిల్ రావడం చాలా పెద్ద విజయమని న్యాయమే గెలిచిందని భూదేవి అన్నారు. మండలంలో 105 పోలింగ్ బూత్‌ల పరిధిలో ఓటర్ల జాబితా పరిశీలించుకోవాలని సూచించారు. బోగస్ ఓట్లు ఉన్నా అర్హులైన వారి ఓట్లు తొలగించిన గుర్తించి వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. అలాగే క్షేత్ర స్థాయిలో ఉన్న ప్రజలకు జరుగుతున్న అన్యాయం పైన విధులు, నిధులు దుర్వినియోగంపై వైసిపి అనుసరిస్తున్న వైఖరిపై ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలన్నారు. చంద్రబాబు మహిళలకు, యువతకు, రైతులకు, విద్యార్థులను ఉద్దేశించి ప్రవేశపెట్టిన భవిష్యత్ గారంటీ పథకాలు గురించి ప్రతి గ్రామంలో, ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలని చెప్పారు. సమావేశంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.


నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు పడాల భూదేవి

ఆదర్శ పాఠశాలలో ఎన్‌సిసి యూనిట్

ప్రజాశక్తి - భామిని

స్థానిక ఎపి మోడల్ స్కూల్‌కు 14 ఆంధ్ర బెటాలియన్, శ్రీకాకుళం వారు ఆర్మీ జూనియర్ వింగ్ ఎన్‌సిసి యూనిట్‌ను కేటాయించారు. ఈ యూనిట్ ద్వారా ఈ విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించనున్నట్లు, విద్యార్థులకు ఫిజికల్ టెస్ట్ నిర్వహించి ఎంపిక చేసినట్లు ప్రిన్సిపల్ రఘుపాత్రుని శివకుమార్ తెలిపారు. ఈ యూనిట్‌కు పాఠశాల కేర్ టేకర్‌గా గొర్లె శివరామ్ ప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్‌గా వ్యవహరించనున్నారు. పాఠశాలకు ఎన్‌సిసి యూనిట్ రావడం పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పేరెంట్స్ కమిటీ చైర్ పర్సన్ నిమ్మల కుమారి, వైస్ చైర్మన్ సాంత్రో సత్యనారాయణ, సభ్యులు ఆనందం వ్యక్తపరిచారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ వితరణ

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజన ఆశ్రమ పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు సమాజ్ పరివర్తన్ సంస్థ ద్వారా స్టడీ మెటీరియల్, నోట్ బుక్స్, పెన్, పెన్సిల్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రధానోపాధ్యాయులు టి.చంద్రరావు ఈ స్టడీ మెటీరియల్‌ను చక్కగా సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలను సాధించాలని కోరారు. ఎంపిపి బి.ఆదినారాయణ మాట్లాడుతూ ఇటువంటి మరిన్ని కార్యక్రమాలు మునుముందు విద్యార్థులకు ఉపయోగపడేలా చేయడానికి తాము సహకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సమాజ్ పరివర్తన్ సంస్థ ఆర్గనైజింగ్ సెక్రటరీ నరేష్, సర్పంచ్ కళావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శివాలయాలు కిటకిట

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

కార్తీకమాసం తొలి సోమవారం సందర్భంగా మండలంలోని శైవ ఆలయాలన్నీ భక్తులతో కిటకిట లాడాయి. తాళ్లబురిడి, బందలుప్పి, పెదబొండపల్లి, నరిసిపురం, చినబొండపల్లి, వెంకంపేట తదితర గ్రామాల్లోని ఆలయాలతో పాటు అడ్డాపుశీల కాశీఅన్నపూర్ణ ఆలయంలో ఉదయం నుండే భక్తులు బారులు తీరారు. పూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం సమీపంలోని తోటలో వనసమారాధనలు జరిపారు.

నేరాలు ఘోరాలు

బస్సు నుంచి జారి విద్యార్థినికి గాయాలు

ప్రజాశక్తి - భామిని

ఆర్‌టిసి బస్సు ఎక్కబోతుండగా స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థిని సేశానపురి రేష్మ జారిపడి తీవ్ర గాయపడిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని

గాయపడిన విద్యార్థినిని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మండలంలోని వివిధ ప్రభుత్వం పాఠశాలల నుండి ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఉద్యోగులు సుమారు వెయ్యి మంది వరకు రాకపోకలు చేస్తుంటారు. ప్రతి రోజు సాయంత్రం విద్యార్థులకు సరైన బస్సు సెల్టర్ లేక రోడ్డుపైన, షాపు ముందు నిలబడి బస్సు కోసం పరిగెత్తే పరిస్థితి. భామిని అంబేద్కర్ కూడలి నుండి బస్సు సెల్టర్ వరకు విద్యార్థులు పరుగులు తీసి, కుస్తీ పడితే గాని బస్సు ఎక్కలేని పరిస్థితి. గతంలో ఇటువంటి పరిస్థితి గమనించిన ఆర్‌టిసి స్టూడెంట్ స్పెషల్ బస్సును ఏర్పాటు చేశారు. ఈ విద్యా సంవత్సరం పూర్తిగా స్టూడెంట్ బస్సు నిలుపుదల చేశారు. ఆర్‌టిసి అధికారులు చొరవ తీసుకుని బస్టాండ్ పూర్తి స్థాయిలో ఆధునీకరించాలని, ఎప్పటిలాగా ప్రత్యేక స్టూడెంట్ బస్సు ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వండువలో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని వండవలో బంటుపల్లివారి వీధిలో సోమవారం జరిగిన అగ్నిప్రమాదంలో పంట్ల అప్పలనరసమ్మకు చెందిన పూరిల్లు దగ్ధమైంది. ఇంట్లో ధాన్యం, బియ్యం బస్తాలు, నగదు ఇంటి పరికరాలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. దీంతో బాధితులు కట్టుబట్టలతో మిగిలిపోయారు. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ మిడితాన కల్యాణి, సచివాలయ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని బాధితులను పరామర్శించారు.